చదువు

టెక్నాలజీలో కొత్త కొత్త ఆవిష్కరణలతో పరిశ్రమల అవసరాలు రోజురోజుకీ మారుతున్నాయి. ఒక విభాగంలో ఇంజినీరింగ్ నైపుణ్యం ఉన్నవారి సేవలు సరిపోవడం లేదు. మెకానికల్ ఇంజినీరింగ్ అభ్యర్థికి ఎలక్ట్రికల్ పరిజ్ఞానం అవసరమవుతోంది. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ విధానానికి సాంకేతిక సహకారాన్ని జోడించాల్సి వస్తోంది. బయాలజీ, ఇంజినీరింగ్‌లను కలిపి చదివితేనే అవకాశాలు అందుతున్నాయి. దీంతో సంప్రదాయ కోర్సులకు భిన్నంగా ప్రత్యేక అవసరాల కోసం సరికొత్త బ్రాంచీలు పుట్టుకొస్తున్నాయి. ఇంటర్ తర్వాత ఐఐటీ, ఎన్ఐటీలు సహా రాష్ట్రస్థాయిలో కొన్ని కళాశాలల్లో వీటిని బోధిస్తున్నారు. ఈ వైవిధ్య కోర్సులు చదివినవారికి పరిశ్రమలు ప్రాధాన్యం ఇస్తున్నాయి.



అరుదైన కోర్సులు మెరుగైన కొలువులు!

ఇంటర్ తర్వాత!

మెకట్రానిక్స్

మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఈ రెండింటి మేళవింపే మెకట్రానిక్స్. ఇందులో కంప్యూటర్ ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్స్, సిస్టమ్ ఇంజినీరింగ్, కంట్రోల్ ఇంజినీరింగ్ కూడా ఉంటాయి. మొబైల్ ఫోన్లు, మోటార్ కార్లు, ఇండస్ట్రియల్ రోబోట్‌లు రూపొందించడానికి మెకానికల్, ఎలక్ట్రికల్ అంశాల్లో ప్రావీణ్యం అవసరం. దీంతో తయారీరంగం చాలా వరకూ మెకట్రానిక్స్‌పై ఆధారపడుతోంది. అలాగే ఆటోమేషన్‌కూ ప్రాధాన్యం పెరిగింది. ఫలితంగా మెకట్రానిక్స్ చదివినవారికి అవకాశాలు విస్తరించాయి. ఫాక్స్‌కాన్, మారుతి లాంటి తయారీ సంస్థల్లో వీరికి ఎక్కువగా ఉద్యోగాలు లభిస్తున్నాయి. మెకట్రానిక్స్‌లో రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్ సైతం ఉంటాయి. ఆటోమోటివ్‌లు, డిఫెన్స్, స్మార్ట్‌సిటీస్, ఈ-కామర్స్‌ల్లో రోబోటిక్స్ వినియోగం పెరిగింది. ఇది మరింత విస్తృతమయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రసిద్ధ సంస్థలు: నిట్ - వరంగల్, రవుర్కెలా; ఐఐటీ- పట్నా, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వంటివి ఈ కోర్సు అందిస్తున్నాయి.

నియామకాలు: హనీవెల్ ఆటోమేషన్, శాంసంగ్, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ ఉత్పత్తులు తయారుచేసే సంస్థలు ఉద్యోగాలు ఇస్తున్నాయి.

ఎనర్జీ ఇంజినీరింగ్

భారత్‌లో ఎనర్జీ వినియోగం 2035 నాటికి ఏడాదికి 4.2 శాతం చొప్పున పెరుగుతుందని ఒక అంచనా. పరిశ్రమలు, ఇళ్లు, కార్యాలయాలు ఇలా ఎక్కడ చూసినా విద్యుత్తు వినియోగం అనివార్యం. అందుకే విద్యుత్తు ఉత్పత్తి, నిల్వ, పంపిణీల గురించి చదువుకునే ఎనర్జీ ఇంజినీర్ల అవసరాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం బొగ్గు, నీరు, నూనెలు, సహజవాయువుల నుంచి శక్తిని సృష్టిస్తున్నారు. ఇటీవలి కాలంలో సోలార్ ఎనర్జీ ప్రాధాన్యం పెరుగుతోంది. ప్రపంచ మనుగడ ఎనర్జీతో ముడిపడి ఉంది. ఈ విభాగంలో అవకాశాలు ఎప్పుడూ ఉంటాయి. ఇందులో చాలామంది కీలకమైన రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు. తక్కువ వ్యయంతో, పర్యావరణ హితంగా, కొత్త మార్గాల్లో శక్తిని ఉత్పత్తి చేయడంపై ప్రపంచవ్యాప్తంగా దృష్టి పెడుతున్నారు. దీంతోపాటు ఇప్పుడు ఉపయోగిస్తున్న శక్తిని మరింత ప్రభావవంతంగా వినియోగించుకునేలా చూస్తున్నారు.

ప్రసిద్ధ సంస్థలు: దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ, ఐఐటీ- బాంబే, దిల్లీ, ఖరగ్‌పూర్; యూపీఈఎస్ - డెహ్రాడూన్, విట్ వంటి సంస్థలు ఈ కోర్సు అందిస్తున్నాయి.

నియామకాలు: ఓఎన్‌జీసీ, స్లంబర్గర్, టోటల్ అండ్ కెర్న్ ఎనర్జీ, ఇతర విద్యుత్తు తయారీ, పంపిణీ సంస్థలు, చమురు కంపెనీలు ఎనర్జీ ఇంజినీర్లను నియమించుకుంటాయి.

ఫుడ్ టెక్నాలజీ ఇంజినీరింగ్

సైన్స్, ఇంజినీరింగ్ రెండింటి కలయికే ఫుడ్ టెక్నాలజీ. ఆహారాన్ని శుద్ధిచేసి, భద్రంగా ప్యాకెట్‌లో ఉంచడానికి ఇటు సైన్స్ అటు ఇంజినీరింగ్ రెండు అంశాల్లోనూ ప్రావీణ్యం ఉండాలి. ప్రిజర్వేషన్, ప్రాసెసింగ్, ప్రిపరేషన్, ప్యాకేజింగ్, స్టోరేజ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఫుడ్ టెక్నాలజీలో కీలక దశలు. ఇప్పుడు ఎక్కువ మంది ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. పట్టణాలతోసహా గ్రామాల్లోనూ ప్యాకెట్ ఫుడ్ తీసుకునేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం నెలకు సగటున ఒక వ్యక్తి గ్రామాల్లో రూ.113, పట్టణాల్లో రూ.236 బెవరేజెస్, రిఫ్రెష్‌మెంట్స్, ప్రాసెస్డ్ ఫుడ్ కోసం వెచ్చిస్తున్నారు. శీతల పానీయాలు, చాక్లెట్లు, పాల ప్యాకెట్లు, పాల ఉత్పత్తులు, బిస్కెట్లు, ఇతర తినుబండారాలు ఫుడ్ టెక్నాలజీ కిందకే వస్తాయి. ఆహార పదార్థాలను శుభ్రపరచి, రుచిగా తయారుచేసి సాంకేతికత జోడించి వాటిని ప్యాక్‌ల్లో భద్రపర్చడమే ఫుడ్ టెక్నాలజీ. భారత ఆహార మార్కెట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ వాటా 30 శాతానికి చేరుకున్నట్లు ఇండియన్ బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ (ఐబీఈఎఫ్) చెబుతోంది. దేశంలోనే ఒక పెద్ద పరిశ్రమగా ఫుడ్ ప్రాసెసింగ్ ఆవిర్భవిస్తోంది. ఉత్పత్తి, వినియోగం, ఎగుమతులు, వృద్ధి ఈ అన్ని విభాగాల్లో కలిపి చూసుకుంటే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ దేశంలో అయిదో స్థానంలో ఉంది. దీంతో ఈ పరిశ్రమకు సంబంధించి పరిశోధన, అభివృద్ధి (రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్), నాణ్యత మదింపు (క్వాలిటీ కంట్రోల్), న్యూట్రిషన్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. బ్యాచిలర్ కోర్సులతోనే ఈ అవకాశాలను సొంతం చేసుకోవచ్చు.

ప్రసిద్ధ సంస్థలు: ఐఐటీ- ఖరగ్‌పూర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ- ముంబయి, కాలేజ్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ- పర్భనీ, సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - మైసూర్, ఓయూ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ- హైదరాబాద్‌ల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

నియామకాలు: ఐటీసీ, పార్లే, నెస్లే, అమూల్, బ్రిటానియా, ఇతర అగ్రోటెక్, ఫుడ్ కంపెనీలు నియమకాలు జరుపుతాయి.

బయో మెడికల్ ఇంజినీరింగ్..

సీటీ స్కాన్, ఎంఆర్ఐ తదితరాలతోపాటు రోగ నిర్ధారణ, వైద్యంలో ఉపయోగించే పలు పరికరాలను బయో మెడికల్ ఇంజినీర్లు తయారు చేస్తారు. వీటిని రూపొందిచడానికి ఒక్క ఇంజినీరింగ్ ప్రావీణ్యం సరిపోదు. మెడిసిన్, బయాలజీ కూడా తెలియాలి. అందుకే బయాలజీ, ఇంజినీరింగ్‌లను కలిపి బయో మెడికల్ ఇంజినీరింగ్ సృష్టించారు. ఇందులో ముఖ్యంగా ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, మెటీరియల్ సైన్స్, బయాలజీ, మెడిసిన్ విభాగాలు ఉంటాయి. ఇంజినీరింగ్ సూత్రాలను బయాలజీ, మెడిసిన్‌కు అన్వయించి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి పరికరాలను సృష్టించడమే బయోమెడికల్ ఇంజినీరింగ్. తక్కువ ఖరీదుతో, నాణ్యమైన, మరింత మెరుగైన పరికరాలను తయారుచేయడం బయోమెడికల్ ఇంజినీర్ల విధి. భారత ఆరోగ్య పరిశ్రమ 2020 నాటికి 280 బిలియన్ డాలర్లు చేరుతుందని అంచనా. ఇందులో వైద్యులు, ఆసుపత్రులతోపాటు బయో మెడికల్ ఇంజినీర్ల పాత్ర కూడా కీలకమే.

ప్రసిద్ధ సంస్థలు: ఐఐటీ - బాంబే, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్, వారణాసి (బీహెచ్‌యూ); ఎంఎన్ఎన్ఐటీ - అలహాబాద్, వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఓయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, బీవీఆర్ఐటీ-హైదరాబాద్.

నియామకాలు: సీమెన్స్ హెల్దీనీర్స్, ఎల్‌అండ్‌టీ, ఫిలిప్ హెల్త్ కేర్, వైద్య పరికరాల తయారీ కంపెనీల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్

కొన్ని రంగాల్లో అభివృద్ధి కాలుష్యానికి కూడా కారణమవుతోంది. దీంతో పర్యావరణ హితమైన అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెడుతున్నాయి. ఆ బాధ్యత ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లదే. పరిశ్రమల నుంచి తక్కువ వ్యర్థాలు, కాలుష్యం వెలువడేలా పలు పరిష్కారాలను వీరు చూపాలి. వ్యర్థాల నుంచి ఉపయోగకరమైన ఉత్పత్తులను సృష్టించే దిశగా ఆలోచించాలి. కొత్తగా ఏ ప్రాజెక్టు, పరిశ్రమ మొదలుపెట్టాలన్నా పర్యావరణ అనుమతులు తప్పనిసరి. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తోంది. దీంతో కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయి. ఎన్విరాన్‌మెంటల్ ఆడిటింగ్, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ మొదలైన ఉద్యోగాలు పబ్లిక్, ప్రైవేటు రంగాల్లో ఉన్నాయి. ప్రాసెస్ డిజైనింగ్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ హ్యాండ్లింగ్, ఆపరేషన్స్ మెయింటెనెన్స్ ఇవన్నీ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్‌కు సంబంధించి ముఖ్యమైన దశలు.

ప్రసిద్ధ సంస్థలు: ఐఐటీ - బాంబే, మద్రాస్, రూర్కీ, ఖరగ్‌పూర్, కాన్పూర్; ధన్‌బాద్ (ఐఎస్ఎం), వారణాసి (బీహెచ్‌యూ), నిట్ - సూరత్కల్, తిరుచిరాపల్లి, నాగ్‌పూర్, వరంగల్, అలహాబాద్, దిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీలు ఈ కోర్సు అందిస్తున్న వాటిలో ప్రధానమైనవి.

నియామకాలు: ప్రభుత్వ ఆధ్వర్యంలోని కాలుష్య నియంత్రణ మండళ్లు, నీటి పంపిణీ, నిర్వహణ సంఘాలు, మున్సిపాల్టీలు, కన్సల్టింగ్, అడ్వైజరీ సంస్థలు, పర్యావరణ అనుమతులతో ముడిపడి ఉన్న కంపెనీలు అంటే గనులు, రహదారులు, మౌలిక వసతులు కల్పించే ప్రాజెక్టులు, పర్యావరణంలో సేవలందించే ఎన్జీవోలు ఇలా పలు చోట్ల ఉద్యోగాలు ఉంటాయి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ ఉర్దూ అకాడమీలో 66 ఖాళీలు

పోస్టు: ఉర్దూ ఆఫీసర్
ఖాళీలు: గ్రేడ్ 1 ఆఫీసర్-06, గ్రేడ్ 2 ఆఫీసర్-60
అర్హత: ఉర్దూ ఒక సబ్జెక్టుగా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత. పదోతరగతిలో రెండో భాషగా తెలుగు చదివి ఉండాలి.
వయసు: 21-44 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
రాతపరీక్ష తేది: 20.05.2018
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు ఫీజు: గ్రేడ్ 1కు రూ.600, గ్రేడ్ 2కు రూ.500 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 02.04.2018 నుంచి 23.04.2018 వరకు.
వెబ్‌సైట్: http://tsua.in/

టీఎంసీలో 242 ఖాళీలు

సంస్థ: టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ), ముంబయి
పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, నర్సు, స్టెనోగ్రాఫర్ తదితర మెడికల్, నాన్ మెడికల్.
ఖాళీలు: మెడికల్-08, నాన్ మెడికల్-234
అర్హత, వయసు: నిబంధనల ప్రకారం.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ/ స్కిల్ టెస్ట్ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
దరఖాస్తు ఫీజు: రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 13.04.2018 **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది:** 20.04.2018
వెబ్‌సైట్: https://tmc.gov.in/

ఎగ్జిమ్ బ్యాంకులో ఆఫీసర్ పోస్టులు

సంస్థ: ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎగ్జిమ్ బ్యాంకు), ముంబయి.
ఖాళీలు: 13 (లీగల్-04, ఐటీ-04, అడ్మినిస్ట్రేషన్-05) **అర్హత:** డిగ్రీ, లా డిగ్రీ, ఎంసీఏ/ బీటెక్/ ఎంటెక్ ఉత్తీర్ణత, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **దరఖాస్తు ఫీజు:** రూ.600 **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** 06.04.2018
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 28.04.2018.
వెబ్‌సైట్: https://www.eximbankindia.in/careers

బీఐఎస్‌లో 153 పోస్టులు

సంస్థ: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్). **పోస్టులు-ఖాళీలు:** యంగ్ ప్రొఫెషనల్-44, ఇంటర్న్-06, ట్రైనీ-103
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, సీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, అనుభవం. **ఎంపిక:** నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆన్‌లైన్
చివరితేది: 25.04.2018. **వెబ్‌సైట్:** http://www.bis.org.in/

హెచ్ఏఎల్, బెంగళూరు

సంస్థ: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), బెంగళూరు. **పోస్టు:** టెక్నీషియన్
ఖాళీలు: 25 **అర్హత:** పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత, అనుభవం. **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్. **దరఖాస్తు ఫీజు:** రూ.200 **ఆన్‌లైన్ దరఖాస్తు:** 28.03.2018 నుంచి 01.05.2018 వరకు **హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది:** 10.05.2018 **వెబ్‌సైట్:** http://www.halnindia.com/

ప్రవేశాలు

ఇంటర్న్‌శాల ఆన్‌లైన్ సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఫేర్

ప్రముఖ ఇంటర్న్‌షిప్ వేదిక 'ఇంటర్న్‌శాల' 2018కిగానూ ఆన్‌లైన్ సమ్మర్ ఇంటర్న్‌షిప్ ఫేర్ (ఓఎస్ఐఎఫ్)ను ప్రకటించింది. ఈ వేసవిలో తమకు నచ్చిన సంస్థలో ఇంటర్న్‌షిప్ చేయాలనుకునేవారి కోసం ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. దీని ద్వారా 21 ప్రముఖ సంస్థలు విద్యార్థులను ఇంటర్న్‌లుగా ఎంచుకోనున్నాయి. ఈ ప్రోగ్రామ్ ఉద్దేశం ఇంటర్న్‌షిప్‌ల ద్వారా ప్రాక్టికల్ శిక్షణను అందించడమే. ఓఎస్ఐఎఫ్ ద్వారా ప్రముఖ సంస్థలు దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో విద్యార్థులను ఎంచుకుంటున్నాయి. ప్రముఖ మీడియా వేదిక 'యూత్ కీ ఆవాజ్' ఈ ఆన్‌లైన్ ఈవెంట్‌కు సంబంధించి ప్రచారకర్తగా చేస్తూ, దీనిపై అవగాహన కల్పిస్తోంది. **దరఖాస్తు చివరితేదీ:** మార్చి 31, 2018 అదనపు సమాచారానికి http://bit.ly/OSIF-18 చూడొచ్చు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

పరిష్కారశక్తి.. పరిజ్ఞానాలకు పరీక్ష!

అనువర్తన ప్రధానంగా చదవాల్సిన భౌతికశాస్త్రాన్ని కంఠస్థం చేసేసి గట్టెక్కాలని చూస్తే సాహసం చేసినట్లే. ఏప్రిల్‌లో జరగబోయే జేఈఈలాంటి పరీక్షలకు ఇది మరీ విరుద్ధం. సబ్జెక్టు పట్ల ఆసక్తిని పెంపొందించుకొని, అనువైన ప్రణాళికతో చదివితే మంచి మార్కులు పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

జేఈఈ-ఫిజిక్స్

గత సంవత్సరాల జేఈఈ మెయిన్ ఫిజిక్స్ పేపర్‌ను గమనిస్తే రెండు విషయాల్లో సరైన సమతౌల్యాన్ని గమనించవచ్చు. అవి- అభ్యర్థి సబ్జెక్టు పరిజ్ఞానం, ప్రాబ్లమ్ సాల్వింగ్ సామర్థ్యం. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని ఫిజిక్స్ ప్రశ్నపత్రాలు తయారుచేస్తున్నట్లు గమనించవచ్చు. గత ఏడాది ఫిజిక్స్ పేపర్‌లో ఇచ్చిన 30 ప్రశ్నల్లో 14 చాలా తేలికగా (44%), 9 మధ్యరకంగా (33%), 7 కొంచెం కఠినంగా (23%) ఉన్నట్లు గమనించవచ్చు. గతంలోనూ ఇంచుమించు ఇదే స్థాయిలో ప్రశ్నలు వచ్చాయి.

కె. రవీంద్ర కుమార్
శ్రీ చైతన్య విద్యాసంస్థలు

వివిధ చాప్టర్ల వెయిటేజీ

- ఎలక్ట్రోస్టాటిక్స్ ఈ చాప్టర్ నుంచి ఏటా 3-4 ప్రశ్నలు
- అసిలేషన్స్ అండ్ వేవ్స్ నుంచి 3- 4 ప్రశ్నలు
- మోడర్న్ ఫిజిక్స్ నుంచి 4- 5 ప్రశ్నలు
- మాగ్నటిజమ్ అండ్ ఎలక్ట్రో మాగ్నటిజమ్: 2 లేదా 3 ప్రశ్నలు
- ఆప్టిక్స్: 3 లేదా 4 ప్రశ్నలు
- కరంట్ ఎలక్ట్రిసిటీ: 3 లేదా 4 ప్రశ్నలు
- ఎలక్ట్రో మాగ్నటిక్ ఇండక్షన్ అండ్ ఆల్టర్నేటింగ్ కరంట్: 3- 4 ప్రశ్నలు
- మెకానిక్స్: 8- 10 ప్రశ్నలు
- థర్మల్ ఫిజిక్స్: 3- 5 ప్రశ్నలు వస్తున్నాయి.

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ పేపర్‌లో మంచి మార్కులు సాధించాలంటే అన్ని చాప్టర్లకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఇప్పుడున్న వ్యవధిలో అన్ని చాప్టర్లలో కనీస పట్టు సాధించడానికి ఈ కింది సూచనలను పాటించాలి.

- మోడర్న్ ఫిజిక్స్ చాప్టర్ పట్ల పట్టు సాధిస్తే అది కెమిస్ట్రీకి కూడా ఉపయోగపడుతుంది. దీనిలో అటామిక్ ఫిజిక్స్, రేడియోఆక్టివిటీ, సెమీకండక్టర్ డివైజెస్, లాజిక్ గేట్స్ వంటి వాటిని తేలికగానే అధ్యయనం చేయవచ్చు.
- అసిలేషన్స్ అండ్ వేవ్స్‌లో డామ్డ్ అండ్ ఫోర్స్‌డ్ వైబ్రేషన్స్, రీజనన్స్ వంటి అంశాలు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో పూర్తి వివరణతో కాకుండా సంక్షిప్తంగా ఉన్నాయి. కాబట్టి వీటి తుది ఫలితాలు, ఫార్ములాలను గుర్తుంచుకోవడం శ్రేయస్కరం.
- ఆప్టిక్స్‌లో.. డిప్రాక్షన్, ఇంటర్ ఫరెన్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకంలో రిసాల్వింగ్ పవర్, దానికి సంబంధించిన అంశాలపై వివరణ కొంత సంక్షిప్తంగా ఉన్నా ఫార్ములాలను గుర్తుపెట్టుకోవడం తేలికే.
- కమ్యూనికేషన్ సిస్టమ్ అండ్ ఎలక్ట్రో మాగ్నటిక్ వేవ్స్‌లో.. కొన్ని అంశాలను గుర్తుంచుకోవాలి.
- ప్రాక్టికల్ ఫిజిక్స్‌లో దాదాపుగా 20% ప్రశ్నలు ప్రాక్టికల్ సంబంధిత అంశాల ఆధారంగా ఉంటాయి. ముఖ్యంగా వెర్నియర్ కాలిపర్స్, స్క్రూగేజ్, ఎర్రర్ అనాలిసిస్, మల్టీమీటర్‌కు సంబంధించిన ప్రశ్నలను సాధన చేయాలి.

ఫిజిక్స్‌లో ఒక ప్రాబ్లమ్‌ను పలుమార్లు సాధన చేయడం వల్ల అది బాగా గుర్తుండి పోతుంది. సబ్జెక్టుకు సంబంధించిన కాన్సెప్టుల్లోనూ విద్యార్థి బలం పెరుగుతుంది. అయితే ప్రాథమిక భావనలపై పట్టు సాధించకుండా కేవలం ప్రాబ్లమ్స్‌నే సాధన చేస్తూ ఉంటే ఉపయోగం ఉండదు. అందుకే ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అనుసరిస్తూ కాన్సెప్టుల పట్ల సరైన పట్టు సాధించాలి. పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల ప్రశ్నల స్థాయి, తీరు పట్ల అవగాహన పెరుగుతుంది. ప్రస్తుతం ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను సరిగా చదవడం సాధ్యం కాకపోయినా ప్రతీ చాప్టర్ చివర ఇచ్చిన సినాప్సిస్‌ను చదువుకుంటే చాలా ఉపయోగకరం.

తుది సూచనలు

- ఫిజిక్స్ పేపర్‌ను సాల్వ్ చేయడంలో సమయపాలన చాలా అవసరం. కనీసం గంట సమయాన్నైనా దీనికి కేటాయించాలి. వరుసగా తెలిసిన ప్రశ్నలను సాధిస్తూ తెలియని వాటినీ, ఎక్కువ సమయం తీసుకునే వాటినీ రెండో రౌండ్‌లో సాల్వ్ చేయాలి. దాని వల్ల సమయం ఆదా అవుతుంది.
- వేగం, కచ్చితత్వం నిరంతర సాధనతో సాధ్యమవుతాయి.
- అన్ని అంశాలనూ ఓసారి పునశ్చరణ చేసుకోవడం మంచిది.
- కొన్ని సందర్భాల్లో సరైన ఫార్ములాను నేరుగా ప్రతిక్షేపించడం వల్ల, కొన్ని షార్ట్‌కట్ పద్ధతుల ద్వారా సరైన సమాధానాన్ని పొందొచ్చు. ఉదాహరణకు- డైమెన్షనల్ ఫార్ములాలను ఉపయోగించవచ్చు. మెకానిక్స్‌లో ఇచ్చే ప్రశ్నలకు 'కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ, లీనియర్, ఆంగ్యులర్ మొమెంటమ్' వంటి సూత్రాలను తగిన సందర్భాన్ని బట్టి ఉపయోగించవచ్చు.
- ప్రశ్నలో ఇచ్చిన నాలుగు ఆప్షన్లను జాగ్రత్తగా చదువుతూ సరైన ఆప్షన్ ఎంచుకోవాలి.
- జ్ఞాపకం ఉంచుకోవాల్సిన కొన్ని ఫార్ములాలు, అంశాలను పట్టికలు లేదా బ్లాక్ డయాగ్రంల ద్వారా పునశ్చరణ చేయవచ్చు. ఉదా: మూమెంట్ ఆఫ్ ఇనర్షియా విలువలు, సెంటర్ ఆఫ్ మాస్ స్థానాలు వంటివి.
- ప్రాబ్లమ్ సాల్వ్ చేసేటపుడు కాలిక్యులేషన్స్‌లో పొరబాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలి.
- పరీక్షను నిర్వహిస్తోంది సీబీఎస్ఈ కాబట్టి ప్రశ్నలను వ్యక్తపరిచే విధానం, భాష పట్ల గమనింపు ఉండాలి.